నేటి దిక్సూచి
తెలుగు జాతీయ దినపత్రిక

ది నానో' పేరుతో విద్యా దందా..?

-అనుమతులు లేకున్నా కాలేజీ నిర్వహణపై ఆరోపణలు

- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి మౌనం ఎందుకు..

-ఫైర్ సేఫ్టీ లేదు.. ఇంటర్ బోర్డు గుర్తింపు లేదన్న విమర్శలు..

-వందలాది మంది విద్యార్థులతో తరగతులు.. లక్షల్లో ఫీజుల వసూళ్లు

-అధికారుల మౌనం వెనుక కారణమేంటి..?

నేటి దిక్సూచి

లక్షల ఫీజులు.. జీరో సేఫ్టీ:

ది 'నానో' కాలేజీలో విద్యార్థుల ప్రాణాలతో జూదం!

గుర్తింపు లేని కాలేజీకి రంగుల ప్రకటనల హంగులు! బోర్డుల పేరు మార్చి.. తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తూ అక్రమ విద్యా వ్యాపారం! 400 గజాల సందుల్లో 300 మంది భవిష్యత్తు బందీ! ప్రమాదం జరిగితే బాధ్యులెవరు? తక్షణమే రంగంలోకి దిగాలని ఉన్నతాధికారులకు స్థానికుల విజ్ఞప్తి!



రంగారెడ్డి /బడంగ్‌పేట్, నేటి దిక్సూచిప్రతినిధి: నూతన విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభమవుతున్న తరుణంలో గ్రేటర్‌లోని ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు జోరందుకున్నాయి. తమ పిల్లలను మంచి విద్యాసంస్థల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆరాట పడుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొన్ని కళాశాలలు దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రధానంగా అనుమతి లేని కాలేజీలు డిస్కౌంట్ పేరుతో విద్యార్థులను మోసగిస్తున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని "ది నానో జూనియర్ కాలేజ్" విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అనుమతులు, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్, ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు వంటి అంశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. "ఫిర్యాదులు ఉన్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు?" అనే ప్రశ్న స్థానికుల నుంచి వినిపిస్తోంది.

ఇరుకు భవనాల్లోనే విద్యా బోధన..?

నాదర్‌గుల్‌లోని విజయలక్ష్మీనగర్ కాలనీలో రెండు క్యాంపస్‌ల పేరుతో కాలేజీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. స్థానికుల వాదన ప్రకారం సుమారు 400 గజాల స్థలంలో నిర్మించిన భవనాల్లో దాదాపు 300 మంది విద్యార్థులతో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు సురక్షితంగా బయటకు వచ్చే ఏర్పాట్లు తగినంతగా ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు ఉన్నాయా..? లేక కేవలం ప్రచారమేనా..?

కాలేజీకి చెల్లుబాటు అయ్యే మున్సిపల్ అనుమతులు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు వంటి కీలక పత్రాలు ఉన్నాయా లేదా అన్న విషయంపై అధికారిక స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. మ-రోవైపు ఆకర్షణీయమైన ప్రకటనలతో భారీ సంఖ్యలో అడ్మిషన్లు చేపట్టి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?

ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకుండా విద్యాసంస్థలు నడిస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్న తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది.

అధికారుల నిర్లక్ష్యమా..? లేక ఫిర్యాదులపై చర్యలు ఆలస్యమా..?

చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘనలపైనా వేగంగా స్పందించే అధికారులు, ఈ వ్యవహారంలో మాత్రం ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదులపై విచారణ జరిగిందా? తనిఖీలు నిర్వహించారా? ఉల్లంఘనలు లేకపోతే ప్రజలకు ఎందుకు వివరణ ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి

జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ, ఫైర్ సర్వీసెస్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తు, భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు లేకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.